డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ప్రభుత్వం ఉచితంగా మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి. రామానందం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయం ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు ఈనెల 21లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్‌జీటీలకు ఇంటర్‌తో పాటు డైట్, టెట్, స్కూల్ అసిస్టెంట్లకు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హతలు తప్పనిసరి అని, వార్షికాదాయం రూ. 2.50 లక్షల లోపు ఉండాలన్నారు.



నేడు పైడితల్లి తొలేళ్లు

పైడితల్లి తొలేళ్ల ఉత్సవం సందర్భంగా చదురుగుడికి వెళ్లే మార్గంలో విద్యుత్తు దీపాలంకరణ

నేడు.. రేపు మద్యం దుకాణాల బంద్

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర నేపథ్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో నగరంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు మూసివేయనున్నట్లు అబ్కారీ శాఖ పట్టణ సర్కిల్ సీఐ మన్మథరావు తెలిపారు. బుధవారం ఉదయం కేవలం బార్లు మాత్రమే తెరవనున్నట్లు చెప్పారు.

నేడు ప్రత్యేక ప్రదర్శనలు

వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: అయోధ్య మైదానంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు పెంపుడు కుక్కలు, పక్షుల ప్రదర్శన ఉంటుందని ఆశాఖాధికారి వై.వి. రమణ తెలిపారు.

ఉత్సవం ఉరిమే ఉత్సాహం

కళారూపాలు.. జానపద నృత్యాలు.. విచిత్ర వేషధారణలు.. వివిధ రకాల అలంకరణలు.. పండ్లు.. పూలు.. ఆహార పదార్థాల ప్రదర్శనలు.. ఒక్కటేమిటి.. చూసేందుకు రెండు కళ్లూ చాలవు.. గజపతుల సామ్రాజ్య వైభవానికి గుర్తుగా.. ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలతో విజయనగరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈ కళల నిలయంలో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా సంబరాలు అంబరాన్నంటాయి.

– ఈనాడు, విజయనగరం, బృందం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, అదితి, కలెక్టర్





బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, అశోక్

పైడితల్లి ఆలయం నుంచి ఉత్సవ ర్యాలీని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉదయం ప్రారంభించారు. వందలాది మందితో వివిధ రకాల ప్రదర్శనల నడుమ కోట, సింహాచలం మేడ, గురజాడ కళాభారతి మీదుగా అయోధ్య మైదానం వరకు సాగింది. ఇందులో 51 కళారూపాలు భాగస్వాములయ్యాయి. కోలాటం, తప్పెటగుళ్లు, థింసా, బిందె, కొమ్ము నృత్యాలు, కర్రసాము, కత్తిసాము, పులివేషాలు, ఒంటెలు, గుర్రాలు, బాక్సింగ్, పులివేషాలు, సాముగారడీలు, చెక్క భజనలు, గంగిరెద్దులు, వెయిట్‌లిఫ్టింగ్, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సందడి చేశారు.



తప్పెటగుళ్ల సందడి



పూల హంసపై కృష్ణుడు






పోలవరం నమూనాను తిలకిస్తున్న అశోక్




పిల్లల స్కేటింగ్

ఆకట్టుకున్న బెలూన్ షో

రాజీవ్ మైదానంలో వేడి గాలి బెలూన్ షో ఆకట్టుకుంది. నిప్పులు కక్కుతూ గాల్లోకి ఎగరడంతో చూసేందుకు యువతీ, యువకులు ఆసక్తి చూపారు. సెట్విజ్ సీఈవో బి.రాంగోపాల్ పర్యవేక్షించారు.







మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు





వావ్.. నృత్యరూపకం

ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి పండగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని ముఖ్య అతిథి శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. గత ప్రభుత్వ విధానాలతో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నానన్నారు. మూడు రోజుల పండగ వాతావరణంలో కార్యక్రమాలు జరగాలని, భావితరాలకు మన సంప్రదాయాలు తెలిసేలా చేపట్టాలన్నారు. ఇంతటి గౌరవాన్ని ఇచ్చిన మాన్సాస్ ఛైర్మన్, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులకు ధన్యవాదాలు తెలిపారు. విజయనగరం అంటే విద్యలనగరమని పేర్కొన్నారు. పీవీజీ.రాజు ఆ పేరును తీసుకురాగా.. ద్వారం, గిడుగు, గురజాడ, సాలూరు రాజేశ్వరరావు తదితరులు ఆ ఖ్యాతిని కొనసాగించారన్నారు.



కోటలో ఏర్పాటు చేసిన వీరజవానుల చిత్ర ప్రదర్శన



భువన విజయం నాటిక

ప్రత్యేక గౌరవం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలతో విజయనగర గౌరవం, కీర్తి పెంపొందుతాయన్నారు. నగర చరిత్ర, ఖ్యాతిని వివరించేందుకు ఏర్పాటు చేసిన లేజర్‌షో పండగ వాతావరణాన్ని తలపించిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సంస్కృతి, సంప్రదాయాలు, కళల పరిరక్షణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, అశోక్‌గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేధు మాధవన్, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల వేషధారణ



మహిళలు బిందెలతో కోలాట ప్రదర్శన





జబర్దస్త్ కామెడీని తిలకిస్తున్న జనం

సిండికేట్ల మధ్య పోటాపోటీ

విజయనగరంలో 5,242.. మన్యంలో 1,393 దరఖాస్తులు

ఈనాడు-విజయనగరం, రాజాం, గజపతినగరం, న్యూస్‌టుడే: మద్యం దుకాణం దక్కేది ఎవరికో తేలే రోజు వచ్చేసింది. చివరి మూడు రోజులు అత్యధికంగా దరఖాస్తులు దాఖలయ్యాయి. విజయనగరంలో 153 దుకాణాలకు 5,242, మన్యంలో 52 దుకాణాలకు 1,393 వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆరు సిండికేట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆది నుంచి వీరు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎవరు.. ఎక్కడ.. ఎన్ని దరఖాస్తులు వేస్తోంది సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

విజయనగరం జిల్లాలో సుమారు 67 దుకాణాలు, మన్యంలో 26 దుకాణాలపై కన్నేశారు. ఒక్కో దానికి అయిదు నుంచి 15కు పైగా ఇచ్చారు. ఒకరిద్దరు సిండికేట్లు వ్యూహాత్మకంగా విజయనగరం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తులు తగ్గించి సాలూరు, వీరఘట్టం, సీతానగరం మండలాలపై ఎక్కువ గురిపెట్టారు. విజయనగరం జిల్లాలో ఒక సిండికేట్ 250కి పైగా.. మరో సిండికేట్ 630కి పైగా దరఖాస్తులిచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆరు సిండికేట్ల తరపున 2,600 దరఖాస్తులకు పైగా దాఖలైనట్లు సమాచారం.



కలెక్టరేట్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎక్సైజ్ ఉప కమిషనర్ బాజ్జీరావు

ఉత్తరాంధ్రలో అగ్రస్థానం

మద్యం దుకాణాలకు దాఖలైన దరఖాస్తుల్లో విజయనగరం జిల్లా రాష్ట్రంలో తృతీయ స్థానం, ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీని వల్ల సర్కారుకు దండిగానే ఆదాయం వచ్చింది. దరఖాస్తుల్లో నెలిమర్ల నియోజకవర్గం ముందంజలో.. ఎస్.కోట వెనుకంజలో ఉన్నాయి. జిల్లా సగటు దరఖాస్తులు 34.26 కాగా నెల్లిమర్ల పరిధిలోని దుకాణానికి అత్యధికంగా 68 అందాయి. ఎస్.కోటలో 142, 143 నంబరు దుకాణాలకు 20 దాఖలయ్యాయి. మన్యంలో సాలూరు నియోజకవర్గం ముందంజలో ఉండగా కురుపాం వెనుకబడింది. సగటున 26.46 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీరఘట్టంలోని రెండు దుకాణాలకు అత్యధికంగా 65, సీతంపేటలోని రెండింటికి అత్యల్పంగా 17 వచ్చాయి. ఉభయ జిల్లాల్లో దరఖాస్తుల ద్వారా విజయనగరం జిల్లా నుంచి రూ.104.84 కోట్లు.. మన్యం జిల్లా నుంచి రూ.27.86 కోట్లు ప్రభుత్వానికి జమైంది.

నేడు లాటరీ

మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం ఉదయం 8 గంటలకు లాటరీ తీస్తారు. విజయనగరం జిల్లాలోని దుకాణాలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రక్రియను ప్రారంభిస్తారు. మన్యం జిల్లాకు సంబంధించి పట్టణంలోని ఎం.ఎస్.నాయుడు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రారంభిస్తారు.

నేడు పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు హాజరై వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264


కాంతులీనుతున్న వనంగుడి



సిరులతల్లి.. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి జాతర నేడు ప్రారంభం కానుంది. తొలి రోజు సోమవారం రాత్రి తొలేళ్లు జరగనున్నాయి. మంగళవారం సిరిమానోత్సవం సాగనుంది. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం భక్తులు దర్శనాలకు తరలివచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల వారు ఘటాలతో మొక్కులు చెల్లించారు.
- న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, రింగురోడ్డు, అయ్యన్నపేట, కోట

పైడిమాంబను దర్శించిన ప్రముఖులు


అమ్మవారిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు, అధికారులు వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, ఆశీర్వచనాల అనంతరం తల్లి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. మంత్రి కొండపల్లి, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి, గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


తల్లి సేవలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు అదితి, గొండు శంకర్


స్పీకర్‌కు చిత్ర పటాన్ని ఇస్తున్న మంత్రి శ్రీనివాస్


ఎమ్మెల్యే కళా వెంకటరావుకు అందజేస్తున్న ఆలయ ఈవో, సిరిమాను పూజారి తదితరులు

నగరంలోని శివాలయంవీధికి చెందిన చిలకలపూడి పైడిరాజు ఐసు పుల్లలతో సిరిమాను ఆకృతి తయారు చేశారు. రూ.50 ఖర్చుతో 6 ఇంచీల ఎత్తులో రథాన్ని సిద్ధం చేశారు. గత 30 ఏళ్లగా వివిధ రకాల వస్తువులతో చేస్తున్నానని చెప్పారు.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్



సాహిత్య నిలయం.. ఆధ్యాత్మిక సంబరం

- నేడు పైడితల్లి తొలేళ్లు
- పూర్తయిన ఏర్పాట్లు


మూడులాంతర్లు సమీపంలో బారికేడ్ల ఏర్పాటు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రోడ్లకు మరమ్మతులు చేశారు. హుకుంపేట నుంచి సిరిమాను రథం బయలు దేరే పుళ్లల వీధి నుంచి కాళ్ల నాయుడు మందిరం వరకు రూ.12.40 లక్షలతో బీటీ రోడ్డు వేశారు. ట్రాఫిక్ ఐల్యాండ్లతో పాటు ప్రధాన కూడళ్లు, రోడ్లు, సెంటర్ డివైడర్లు, ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

నిరంతర తాగునీటి సరఫరా

పండగ రెండు రోజుల్లోనూ తాగునీటి సరఫరా చేయనున్నారు. ఇప్పటికే 1000 కిలో లీటర్ల లిక్విడ్ క్లోరిన్, బ్లీచింగ్ సిద్ధం చేశారు. సోమ, మంగళవారాల్లో భక్తుల సౌకర్యార్థం 20 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అమ్మవారి కోవెల, గంటస్తంభం, కోట కూడలి, అయోధ్య మైదానం, పాత బస్టాండ్, సింహాచలం మేడ, బాలాజీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్, ఎస్పీ బంగ్లా కూడలి, గురజాడ అప్పారావు విగ్రహం ద్వారం, దాసన్నపేట రైతు బజారు, సీఎంఆర్ కూడలి, రామారాయుడు కూడలి, కొత్తపేట నీళ్ల ట్యాంకు, అంబటిసత్రం కూడలి, ఎత్తుబ్రిడ్జి, బాలాజీ నీళ్లట్యాంకు, ఆర్ అండ్‌బీ కూడలి, నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద పెట్టనున్నారు.

120 బయో మరుగుదొడ్లు..

నగరపాలిక పరిధిలో 120 తాత్కాలిక బయో మరుగుదొడ్లు పెడుతున్నారు. ఉత్సవాలు జరిగే వేదికలతో పాటు జాతరకు సంబంధించిన ప్రధాన కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచనున్నారు. పారిశుద్ధ్య పనులకు అదనంగా 330 మందిని నియమించారు. వీరంతా మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నారు. వీరు కాకుండా అదనంగా మరో 100 మంది విధుల్లో ఉండనున్నారు. వారంతా ఏకరూపు దుస్తులు ధరిస్తారు. ప్రస్తుతమున్న 620 మంది ప్రత్యక్షంగా పనులు చేయనున్నారని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. ఏకంగా రూ.1.30 కోట్ల మేర ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు.

సిరిమాను మార్గంలో 80 సీసీ కెమెరాలు

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సిరిమానోత్సవంలో భాగంగా 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బందోబస్తులో ఉన్న పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలను కూడా ఇవ్వనున్నారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 61 మంది సీఐలు, ఆర్ఐలు, 147 మంది ఎస్సైలు, ఆర్ఎస్సైలు, 17 మంది మహిళా ఎస్సైలు, 425 మంది ఏఎస్సైలు, హెచ్‌సీలు, హెడ్ కానిస్టేబుళ్లు, 136 మంది మహిళా కానిస్టేబుళ్లు, 369 మంది హోంగార్డులు, 200 మంది ఏఆర్ సిబ్బంది విధుల్లో ఉంటారని చెప్పారు. జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి రానున్నారన్నారు.

ప్రత్యేక బృందాలు..

ఆలయం ఎదురుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు ● నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా 44 మంది పోలీసు అధికారుల ఆధ్వర్యంలో 20 బృందాలు పనిచేస్తాయన్నారు. మరో 40 మందితో 4 క్విక్ రియాక్షన్ టీమ్స్‌ను సిద్ధం చేశామని వెల్లడించారు. భక్తులకు సహాయ, సహకారాలు అందించేందుకు 25 మందితో 'సేవాదళ్' ఉంటుందని, ఈవ్ టీజింగ్ చేసే ఆకతాయిలను గుర్తించేందుకు 24 మందితో షీ టీమ్స్ తిరుగుతాయన్నారు.

రాకపోకలు నిషేధం..

సిరిమానోత్సవం రోజున ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బాలాజీ కూడలి, సింహాచలం మేడ, కోట, గంటస్తంభం, ఎంఆర్ కళాశాల, గురజాడ కూడలి, కన్యకా పరమేశ్వరి కోవెల, గంటస్తంభం, ట్యాక్సీ స్టాండ్, ఎంజీ రోడ్డు, గుమ్చీ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధిస్తామన్నారు. భక్తులంతా ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకుని, ఇళ్లకు వెళ్లాలని కోరారు.


మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్





చరిత్రను తెలిపే లేజర్ షో

విజయనగరం చరిత్ర, సంస్కృతి, గజపతుల చరిత్రను తెలియజేసేలా కోట వద్ద లేజర్ షోను ఏర్పాటు చేశారు. మంత్రి కొండపల్లి ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనుందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. 250 ఏళ్ల నాటి చరిత్రను ప్రదర్శిస్తున్నామన్నారు. పైడిమాంబ దేవిని ఉన్నతంగా ... సిరిమానోత్సవ సంబరం, వనంగుడి, చదురుగుడి, గజపతిరాజుల పాలన తదితరాలను తెలియజేస్తున్నట్లు చెప్పారు. మాన్సాస్ ట్రస్టు చైర్మన్ అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పీవీజీ.రాజు చిత్రం


తిలకిస్తున్న గజపతిరాజు కుటుంబ సభ్యులు, కలెక్టర్ తదితరులు

బాధితుడికి రూ.1,11,500 ఆర్థిక సాయం

పాచిపెంట, న్యూస్‌టుడే: కొత్తవలసకు చెందిన జి.హరనాథ్ కుటుంబానికి గ్రామస్థులు రూ.1,11,50 ఆర్థిక సాయం చేశారు. మెకానిక్‌గా పనిచేస్తున్న ఆయనకు కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. శస్త్రచికిత్స చేసినప్పటికీ నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు విరాళాలు సేకరించి దసరా నాడు ఆయన తల్లి విజయమ్మకు నగదు అందజేశారు.


నగదు ఇస్తున్న గ్రామస్థులు

పారదర్శకంగా దుకాణాల లాటరీ ప్రక్రియ

విజయనగరం, ఈనాడు: మద్యం దుకాణాలకు సోమవారం చేపట్టే లాటరీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదివారం సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు అబ్కారీ శాఖ ఉప కమిషనర్ కె.వి.వి.ఎన్.బాబ్జీరావు, సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు వివరించారు. తొలి విడతలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 50 దుకాణాలకు.. రెండో విడతలో 10- 12 గంటల వరకు 51- 100 దుకాణాలకు.. మూడో విడతలో మధ్యాహ్నం 12 నుంచి 101- 153 దుకాణాలకు లాటరీ తీసి కేటాయిస్తామన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బొబ్బిలి, న్యూస్‌టుడే: లారీని తప్పించబోయిన కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకెళితే.. బొబ్బిలికి చెందిన ఆర్.వరలక్ష్మి(59) తన కుమారులతో కలిసి కారులో శనివారం రాత్రి ములుగు నుంచి భీమవరం వెళ్తుండగా.. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో వరలక్ష్మి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుమారులు రామకృష్ణనాయుడు, గణపతినాయుడు గాయపడ్డారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వరలక్ష్మి (పాతచిత్రం)

సముద్రంలో యువకుడి గల్లంతు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: దేవీ నిమజ్జనానికి వెళ్లిన ఓ యువకుడు సముద్రంలో గల్లంతవడంతో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందిన వై.అచ్యుతరావు(25)తో పాటు గ్రామంలోని పలువురు యువకులు చింతపల్లి వద్దగల సముద్రతీరానికి వచ్చారు. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలలకు అచ్యుతరావు లోపలికి కొట్టుకుపోయాడు. స్థానికుల సహకారంతో ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి సమయం కావడంతో నిలిపి వేశారు. గతేడాది స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎంటీఎస్)కు ఎంపికై ఉద్యోగంలో చేరాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. అతనికి తల్లిదండ్రులు రాము నాయుడు, ఈశ్వరమ్మ, సోదరి సునీత ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.


అచ్యుతరావు

విధుల్లో కానిస్టేబుల్ దుర్మరణం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ రైలు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పార్వతీపురంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై బాలాజీరావు వివరాల మేరకు.. జియ్యమ్మవలస మండలంలోని తుంబలి గ్రామానికి చెందిన జి.మల్లేశ్వరరావు(37) పార్వతీపురం పట్టణ స్టేషన్‌లో పని చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగేవారిని పట్టుకునే క్రమంలో తనిఖీల నిమిత్తం శుక్రవారం పట్టణ శివారుకు వెళ్లారు. అక్కడ పట్టాలు దాటుతుండగా రాయగడ నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. మల్లేశ్వరరావు గతంలో గుమ్మలక్ష్మీపురం పరిధిలో పనిచేయగా ఇటీవల పార్వతీపురం స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారని ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.


మల్లేశ్వరరావు (పాతచిత్రం)

డి.నెలివాడలో నగదు, బంగారం చోరీ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: మండలంలో డి.నెలివాడలో శనివారం రాత్రి డి.ఉమామహేష్ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. దసరా నేపథ్యంలో రామతీర్థంలోని అత్తవారి ఇంటికి భార్య రాజ్యలక్ష్మితో కలిసి ఆయన వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో కిటికీ అద్దాలు పగలుగొట్టిన దుండగులు బీరువాలోని రూ.లక్ష నగదు, తులం పావు బంగారు అభరణాలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితులు తలుపులు తీసేసరికే కిటికీ అద్దాలు పగిలి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం, పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

గండేపల్లి: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కి.. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, చరవాణులు, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళలు ఆరితేరితే వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. ఎట్టకేలకు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయారు. వీరిలో విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన జి.రేవతి కూడా ఉంది. ఈమేరకు ఆమెను అరెస్టు చేశారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్.కోట మండలంలో జరిగింది. సీఐ నారాయణమూర్తి వివరాల ప్రకారం పెదఖండేపల్లికి చెందిన పి.రాంబాబు(55) కొన్నేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గడ్డి మందు తాగేశారు. కుటుంబ సభ్యులు చూసి చికిత్స నిమిత్తం విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ప్రసాదరావు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత బలవన్మరణం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు. పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన లంకా అప్పలనాయుడు నక్కపల్లిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ, భార్య మౌనిక(26)తో కలిసి తిమ్మాపురంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం మౌనికకు కడుపునొప్పి తీవ్రమై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పుడే విధుల నుంచి ఇంటికి వచ్చిన అప్పలనాయుడు వెంటనే అడ్డురోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి తునికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తహసీల్దారు రమేష్‌బాబు సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.



గుంటూరు జిల్లా మంగళగిరిలో 'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ లీగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటారు. మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఫైనల్స్‌లో కృష్ణ జట్టుపై జయ కేతనం ఎగుర వేసి ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదు అందుకున్నారు.
– న్యూస్‌టుడే, మంగళగిరి, విజయనగరం క్రీడా విభాగం


జాతీయస్థాయి పోటీలకు అథ్లెట్లు

క్రీడావిభాగం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది ఎంపికయ్యారు. ట్రిపుల్ జంప్‌లో పాల్‌కుమార్, లాంగ్ జంప్‌లో నీలిమ, 1000 మీటర్ల పరుగులో భార్గవి, 100, 200 మీటర్ల పరుగులో వసంత, 400 మీటర్ల విభాగంలో బి.శ్రావణి, 1000 మీటర్లలో ఎం.హరీష్, 3000 వాక్‌లో బి.హరీష్, లాంగ్ జంప్‌లో భార్గవి ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వీరిని జేసీ సేథు మాధవన్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు అభినందించారు.

ఉత్సాహంగా విజయనగరం క్రీడలు

క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం విజ్జీ మైదానంలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు హాజరై నిర్వాహకులు, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, స్కేటింగ్ విభాగాల్లో పలువురు సత్తా చాటారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులలో సరదాగా ఆడుతూ అలరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్, అవనాపు విజయ్, డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి కొండపల్లి తదితరులు


కబడ్డీ పోరులో క్రీడాకారిణులు

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? మామిడివలస గ్రామంలో ప్రధాన రహదారి రాళ్లు తేలి.. ఇబ్బందికరంగాఉంది. **- స్థానికులు**

● రహదారి బాగుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తాం. **- ప్రణయ, ఆర్అండ్‌బీ ఏఈ**

– న్యూస్‌టుడే, రామభద్రపురం

? గింజేరు మండల పరిషత్తు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. **- స్థానికులు**

● పరిశీలించి పూర్తిస్థాయి రహదారి సౌకర్యం కల్పిస్తాం. **- భానోజీరావు, ఈవోపీఆర్డీ**

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? తెర్లాంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో వృద్ధులు, పిల్లలు భయపడుతున్నారు. **- యువకులు, తెర్లాం, ఆమిటి**

● పంచాయతీల పాలకవర్గాలతో చర్చించి, చర్యలు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించాం. **- ఆర్.నీలిమ, పంచాయతీ విస్తరణాధికారిణి**

– న్యూస్‌టుడే, తెర్లాం

? సారథి రహదారిలోని చెవి, మూగ పాఠశాల వద్ద కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. **- స్థానికులు**

● పరిశీలించి, కాలువలోని చెత్తను తొలగించే చర్యలు చేపడతాం. **- రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం పురపాలక సంఘం**

– న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

రైతుల జాబితా తయారు చేయండి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దారు శ్రీను అన్నారు. ఆదివారం మండలంలోని వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 18 ఆయకట్టు సంఘాలున్నాయని, వాటి పరిధిలో ఎంత మంది ఉన్నారో గుర్తించి సక్రమంగా జాబితాలు అందించాలన్నారు.

క్రీడాకారులకు మంత్రి అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన 36వ జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించిన పెదనడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు కిల్లారి ఇందు, జి.సాయికుమార్ తమ కోచ్‌లతో కలిసి ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలన్నారు. డీఎస్‌డీవో జి.వెంకటేశ్వరరావు, శిక్షకుడు మజ్జి రామారావు ఉన్నారు.

గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో మెరికలు

గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పతకాల పంట పండిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ.. చదువును, క్రీడలను సమన్వయం చేసుకొని రెండింటిలోనూ రాణిస్తున్నారు. సంతకవిటి, రాజాం మండలాల్లోని పలువురు విద్యార్థులు పాఠశాలలకు, జిల్లాకు పేరు తీసుకొస్తున్నారు. వారి విజయాలపై కథనం..

– న్యూస్‌టుడే, సంతకవిటి, రాజాం గ్రామీణం

జాతీయస్థాయిలో స్వాతి..



సిరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోన్న **ఆర్.స్వాతి** 100, 200 మీటర్లు.. 400×100 రిలే పరుగు పందెం పోటీల్లో రాణిస్తోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అండర్-14 పోటీల్లో విజేతగా నిలిచింది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే క్రీడల్లో రాణిస్తున్నట్లు స్వాతి చెబుతోంది.

క్రీడల్లో జ్యోత్స్న జోష్



సిరిపురం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న **బి.జ్యోత్స్న** ఖోఖో, పరుగు పందెం పోటీల్లో సత్తాచాటుతోంది. ఇటీవల నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించింది. గ్రామానికి, ఉపాధ్యాయులకు పేరుతీసుకొచ్చింది.

బాల్‌బ్యాడ్మింటన్‌లో నిష్నాత్..



రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన **పి.వెంకట నిష్నాత్** జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించాడు. 2023, 2024లో అండర్ - 14 రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలులోని మహానంది, శ్రీకాకుళంలోని కేశవరావుపేటల్లో సత్తాచాటాడు. ఆటలో గురువులు నేర్పిన మెలకువలే పతకాలు సాధించేందుకు ఉపయోగపడ్డాయని నిష్నాత్ అంటున్నాడు.

రాజశేఖర్ రాణిస్తున్నాడు..



వి.రాజశేఖర్ ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతున్నాడు. క్రీడలపై ఉన్న ఆసక్తితో అథ్లెటిక్స్‌లో మెలకువలు నేర్చుకుని జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్నాడు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో 200, 400 మీటర్ల పరుగుపందెం, జావెలిన్‌త్రో సత్తాచాటాడు. సిరిపురం పాఠశాలలో నేర్చుకున్న మెలకువలే ఈ స్థాయిలో నిలిపాయని రాజశేఖర్ అంటున్నాడు.

రాష్ట్రస్థాయిలో సోనియా..



సిరిపురం గ్రామానికి చెందిన **బి.సోనియా** వైజాగ్, తిరుపతి, ఏలూరు, గుంటూరు, నరసరావుపేటల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో.. 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచింది. సోనియా ప్రస్తుతం ఇంటర్ ప్రథమ ఏడాది చదువుతోంది. ఇప్పటికీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సిరిపురం పాఠశాలకు వెళ్లి వ్యాయామ ఉపాధ్యాయులు వద్ద సాధన చేస్తున్నట్లు ఆమె చెబుతోంది.

ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ మంది ఆటల్లో రాణించాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నాం. క్రీడల్లోని మెలకువలు నేర్చుకుంటుండటం వల్ల రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణిస్తున్నారు.

– సిరిపురం ఉన్నత పాఠశాల పీడీ కె.సన్నిబాబు

దేశసేవకు సిద్ధమైన యువతకు సత్కారం



సత్కరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి, శిక్షకులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల అగ్నిపథ్‌లో ఉద్యోగాలు సాధించిన పది మంది గ్రామీణ యువకులను ఆదివారం చీపురుపల్లి అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఘనంగా సత్కరించారు. శిక్షకులు కోరాడ వేణు, పీసీ స్వరూప్ వద్ద చీపురుపల్లి పరిసర గ్రామాల యువకులు గత కొంత కాలంగా ఉచితంగా శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. వారిని శిక్షకులు, అగ్నిమాపకశాఖ అధికారి హేమసుందర్ సత్కరించారు. సాంఘికశాస్త్రం నిపుణుడు డి.నాగరాజు, ఆశయ సంస్థ అధ్యక్షుడు ఆర్.రమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మురళీధరరావు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

రాజాం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తవిటినాయుడు, సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం రాజాంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ఆబ్కారీ సర్కిల్ పరిధిలోని 16 మద్యం దుకాణాలకు ఈనెల 14న విజయనగరం కలెక్టర్ కాంప్లెక్సులోని ఆడిటోరియంలో లాటరీ నిర్వహించనున్నట్లు సీఐ సీహెచ్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారంతా గమనించాలని కోరారు.

కాలువ శుభ్రం

స్పందనకు వందనం

బొండపల్లి: ఎం.ఎన్.ఛానల్ నుంచి కనిమెరక మీదుగా కృష్ణమ్మ చెరువుకు వెళ్లే కాలువలో తుప్పలు పెరిగిపోయాయి. దీంతో శివారు భూములకు నీరు గగనమైంది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఉపాధి ఏపీవో బి.కృష్ణవేణి స్పందించారు. వేతనదారులతో పూడిక తొలగింపజేశారు.

రహదారి నిర్మాణం

రామభద్రపురం: మిర్తివలస పంచాయతీ కారేదువలస గిరిజన గ్రామానికి కంకర రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ రహదారి సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో వెలువడిన కథనానికి సర్పంచి రాంబాబు స్పందించారు. పంచాయతీ నిధులు రూ.లక్షతో కంకర వేయిస్తున్నారు.

ధూళి సమస్యకు పరిష్కారం

గంట్యాడ గ్రామీణం: బుడతనాపల్లి మీదుగా కొటారుబిల్లి వెళ్లే మార్గంలో ఎక్కువగా కంకర లారీలు తిరుగుతున్నాయి. రహదారిపై ధూళి రేగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి ట్యాంకర్లతో రహదారిని తడిపారు.

నేడు పల్లెపండగ

తెర్లాం, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహించే పల్లె పండగను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని ఎంపీడీవో రేగి రాంబాబు కోరారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పెరుమాళిలో ప్రారంభిస్తున్నామని, ఎమ్మెల్యే బేబీనాయన హాజరవుతారని చెప్పారు.

తుప్పలు తొలగించండి



బొబ్బిలి నుంచి మక్కువ వెళ్లే రహదారిలో ఇరువైపులా దట్టమైన తుప్పలు మొలిచాయి. వాటిని తొలగించకపోవడంతో మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో ఏళ్లుగా అధికారులు చర్యలు తీసుకోలేదు. బొబ్బిలి-బలిజిపేట, బొబ్బిలి- శివడవలస రహదారుల దుస్థితి ఇంతే. తొలగించడానికి చర్యలు తీసుకుంటామని ఏఈ రాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

ప్రమాదకరంగా మలుపు

రామభద్రపురం మండలంలోని పలు గ్రామాల రహదారుల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రామభద్రపురం, మర్రివలస, నాయుడువలస, ఆరికతోట, బూసాయవలస, ముచ్చర్లవలస, తారాపురం, కొట్టక్కి, పాలవలస జాతీయ రహదారుల మలుపుల్లో ప్రమాదాల నివారణకు ఎటువంటి సూచికలు లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ ప్రసాదరావు అన్నారు.

– న్యూస్‌టుడే, రామభద్రపురం



కలుషితం.. ఆపై ఆక్రమణ



దుకాణదారులు, భోజనశాలలు నిర్వహించే వారు వ్యర్థాలను తీసుకువెళ్లి గజపతినగరం పక్కన ఉన్న మల్లపు చెరువులో వేస్తున్నారు. దీంతో చెరువు పూడిపోతోంది. పరిసరాల్లో ఉన్నవారు ఆ ప్రాంతాన్ని ఆక్రమిస్తున్నారు. ఇలా క్రమంగా ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతోంది. మరోపక్క చెరువులో వ్యర్థాలు వేయడంతో నీరు కలుషితం అవుతోంది. వెంటనే వీటిని నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రత్నకుమార్ అన్నారు. దుకాణల్లో వ్యర్థాలు చెరువులో వేయడంపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి జనార్దనరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, గజపతినగరం

విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహం ఆవిష్కరిస్తున్న మందకృష్ణ మాదిగ

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శనివారం రాత్రి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సభకు ప్రధాని మోదీ హాజరై.. తమ ఆవేదన ఆలకించి మాదిగ రిజర్వేషన్ల విషయాన్ని పరిష్కరించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేశారన్నారు. మాదిగల రిజర్వేషన్ల బిల్లుకు కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, లక్షలాది మందికి న్యాయం జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు ఎం.నాగరాజు, బి.శ్రీను, ఎస్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



లోచర్ల-ఆమిటి మధ్య ఎత్తిపోతల పథకం నిర్మించాల్సిన స్థలం

వేల ఎకరాలకు సాగునీరు

తెర్లాంలో ఎత్తిపోతల పథకం నిర్మిస్తే తెర్లాం మండలంలోని ఆమిటి, లోచర్ల, సింగిరెడ్డివలస, సీతారాంపురం, నెమలాం, పణుకువలస, సోమిదవలస, డి.గదబవలస, వెలగవలస, పెరుమాళి, మెరకముడిదాం మండలంలోని రాచగుమడాం, భీమవరం, ఎం.గదబవలస తదితర గ్రామాలకు చెందిన దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అప్పట్లో అధికారులు అంచనా వేశారు.

గత సర్కారు తెచ్చిన సాగునీటి తిప్పలు

న్యూస్‌టుడే, తెర్లాం

తోటపల్లి కుడి ప్రధాన కాలువ పక్కనే ఉన్నా.. తెర్లాం మండలంలోని రైతులకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. ఇక్కడ తోటపల్లి కాలువకు సమీపంలో ఎత్తిపోతల పథకం నిర్మిస్తే తెర్లాంతోపాటు మెరకముడిదాం మండలంలోని పలు గ్రామాల పరిధిలోని దాదాపు 10 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని దాదాపు 15 ఏళ్లుగా అన్నదాతలు విన్నవిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

రూ.16.41 కోట్లతో..

తెర్లాం మండలంలోని ఆమిటి, లోచర్ల గ్రామాల మధ్య తోటపల్లి కుడి ప్రధాన కాలువను ఆనుకొని ఖాళీ స్థలంలో ఎత్తిపోతలు పథకం నిర్మిస్తే ఎగువన ఉన్న పలు గ్రామాల పొలాలకు సాగునీరు అందుతుందని 2008లో లోచర్లలో నిర్వహించిన ప్రజా పథం కార్యక్రమానికి వచ్చిన సందర్భంలో రైతులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ అప్పట్లో దీన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరికి గత తెదేపా హయాంలో అడుగులు పడ్డాయి. 2019 ఎన్నికలకు ముందు ఏపీఎస్ఐడీసీ సంస్థ ఆధ్వర్యంలో ఎత్తిపోతలు నిర్మించేందుకు రూ.16.41 కోట్లు మంజూరయ్యాయి. అదే సంవత్సరం ఫిబ్రవరిలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు భూమిపూజ చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పనుల్ని పక్కన పెట్టింది.

ఇంజిన్లతో తోడుతున్నాం

కుడి ప్రధాన కాలువ మా గ్రామం వద్దే ఉంది. కానీ పొలాలకు నీరు అందే పరిస్థితులు లేవు. ఇంజిన్ల సాయంతో పొలాలకు నీరు పెట్టి, బతికించుకుంటున్నాం. లేకపోతే వర్షాలపై ఆధారపడి సాగు చేయాల్సి వస్తోంది. – **కరణం రమేష్, పైడినాయుడు, రైతులు, ఆమిటి గ్రామం**

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు అప్పట్లో ఏపీఎస్ఐడీసీ అధికారులు చొరవ చూపారు. తరువాత దీనికి సంబంధించి పై అధికారుల నుంచి ఎటువంటి నివేదిక రాలేదు. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– **విశ్వేశ్వరనాయుడు, ఏఈ, తోటపల్లి కాలువ, తెర్లాం సెక్షన్**


జగజ్జనని



రామభద్రపురం: దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా పలు చోట్ల అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, బొండపల్లి, గజపతినగరం, గంట్యాడ గ్రామీణం, బొబ్బిలి, గ్రామీణం, తెర్లాం, చీపురుపల్లి, గ్రామీణం, రాజాం, మెంటాడ, రామభద్రపురం



గాజుల అలంకరణలో...



కనకమహాలక్ష్మి అమ్మవారు



రాజరాజేశ్వరిగా మానసాదేవి



నవదుర్గ అమ్మవారు



వంగర: పూజలు చేస్తున్న భక్తులు

దుస్తుల పంపిణీ



బొబ్బిలి పట్టణంలోని శ్వేతాచలపతి సంస్థానం ఉన్నత పాఠశాలలో 2017-18లో చదివిన పూర్వవిద్యార్థులు.. వివిధ ఘటనల్లో మృతిచెందిన స్నేహితులకు గుర్తుగా ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. సుమారు 100 మంది పేదలకు భోజనాలు, దుస్తులు అందజేశారు. న్యాయవాది విల్సన్‌బాబా, పూర్వవిద్యార్థుల సంఘ నాయకులు సత్తిబాబు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. – న్యూస్‌టుడే, బొబ్బిలి

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

రామభద్రపురం: ఎస్‌బీఐ సేవా కేంద్రంలో ల్యాప్ టాప్, ఆరికతోటలో బంగారం చోరీ కేసులలో మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన భగవాన్‌ను రామభద్రపురంలో అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాదరావు తెలిపారు. ల్యాప్‌టాప్, అరతులం బంగారం స్వాధీనం చేసుకొని నిందితుడ్ని కోర్టుకు తరలించామన్నారు.

ప్రబలుతున్న విషజ్వరాలు

గుర్ల: గుర్లలో పలువురు విషజ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన పలువురికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేవలు అందిస్తున్నారు. మండల భాజపా నేత సీహెచ్.అప్పారావు అతిసారంతో మృతి చెందినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయం వైద్యాధికారి చెన్నయ్య వద్ద ప్రస్తావించగా.. వేరే కారణాలతో మృతి చెందాడని అతిసారం కాదన్నారు.

సంక్షిప్త సమాచారం

మర్యాదపూర్వక కలయిక

సంతకవిటి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగను సంతకవిటి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు కె.విజయకుమార్, ఎమ్.వాసుదేవరావు తదితరులు రాజాంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని సమస్యలు అతని దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

చెత్త బుట్టల పంపిణీ

గరివిడి: కొండపాలెం (గరివిడి) మేజరు పంచాయతీని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు దుకాణాదారులందరికీ చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్నట్టు సర్పంచి పి.ప్రమీల, ఈవో శ్రీనివాస్ తెలిపారు. గరివిడిలో మాంసం, చేపలు దుకాణాలు నడుపుతున్న వారందరికీ ఆదివారం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఇకనుంచి బుట్టల్లో చెత్తను నిల్వచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని ఈవో సూచించారు.

సాయిబాబాకు పుష్పాభిషేకం



చీపురుపల్లి: చీపురుపల్లి రుంకాన వీధి దత్త సాయిమందిరంలో షిర్డీ సాయిబాబా పుణ్యతిథి నిర్వహించారు. స్వామి వారికి 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్పార్చన, సహస్ర నామపారాయణం, భారీ అన్నసమారాధన నిర్వహించారు. బాలభవన్ విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

మాజీ సర్పంచి కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జస్టిస్ తుషార్‌రావు

వంగర, న్యూస్‌టుడే: వంగర మాజీ సర్పంచి రామారావునాయుడు ఈ నెల 11న మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.తుషార్‌రావు, సుప్రీం కోర్టు న్యాయవాది వై.రాజ్‌గోపాల్ రావునాయుడు ఆదివారం పరామర్శించారు. రామారావునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సోదరుడు మాజీ జడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడుతో మాట్లాడారు.

పేదలకు సహాయం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా చీపురుపల్లి మండలం ఇటకర్లపల్లికి చెందిన యువకులు దాతృత్వం చాటుకున్నారు. గ్రామంలో మంచం పైనుంచి కదల్లేని స్థితిలో ఉన్న మాదేటి కృష్ణ, మీసాల పున్నమ్మ, గాడి నారాయణ కుటుంబాలకు గ్రామానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు రూ.30 వేలు, మిఠాయి బాక్సులను అందించారు. ఎల్.రాము, ఎస్.సూర్యనారాయణ, డి.పైడిరాజు, కె.రమణయ్య, షేక్ పీర్‌సాహెబ్, డి.చినశ్రీను, అలిగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదు, మిఠాయి అందిస్తున్న దాతలు

తిరువీధి ఉత్సవం



అమ్మవారి ఘటాన్ని దర్శించుకుంటున్న భక్తులు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ ఘటం తిరువీధి ఆదివారం నిర్వహించారు. ఆలయం వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి.. ఘటాన్ని దర్శించుకొని, ముగ్రాటలతో మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం వేకువజాము వరకు ఉత్సవం కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. కోలాటాలు, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బొండపల్లి మండలంలో నెలివాడ రాజచెరువు వద్ద పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం ఒడిశా నుంచి విజయనగరం ఇనుము లోడుతో వెళ్తున్న భారీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. పక్కనున్న పంట పొలాల్లోకి వెళ్లిపోయింది. లారీ చోదకుడు, సహాయకుడు అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా బయట పడ్డారు. పోలీసులు చేరుకొని వాహనాన్ని బయటకు తీయించారు.


– న్యూస్‌టుడే, బొండపల్లి



విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట


చిన్నారుల కర్రసాము


పైడితల్లి పూజా విధానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు



విజయనగర ఉత్సవాలు, పైడితల్లి జాతర నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. బంధు, మిత్రులతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటైన ప్రదర్శనలు, ప్రత్యేక కార్యక్రమాలను చూసేందుకు సందర్శకులు తరలి వస్తున్నారు. పుష్పాలు, ప్రాజెక్టులు, జాతీయ నాయకులు, వీర సైనికులు, జిల్లా ప్రముఖులతో కూడిన ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. గురజాడ కళాభారతి, ఆనంద గజపతి ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా జరుగుతున్నాయి. - న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, అయ్యన్నపేట, రింగురోడ్డు, కోట



ప్రముఖుల వైభవం.. విజయనగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన కలియుగ భీముడు కోడి రామ్మూర్తి, హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు, గాన కోకిల పి.సుశీల, గాన గంధర్వ ఘంటసాల, సిద్ధార్థ పూసపాటి ఆనంద గజపతిరాజు చిత్రపటాలతో విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. మహారాజుల వైభవాన్ని చాటేలా గుర్రాలు, ఒంటెల మీద బాలబాలికలు ముందుకు కదిలారు.


దేవీ రూపాల్లో యువతులు

కోదండ రథ చక్రరూపం

ఉద్యాన శాఖ పుష్ప ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గజపతి, కోదండ రథ చక్రాలు, బిడ్డను ఆడిస్తున్న తల్లి, డాల్ఫిన్ ఆకృతులు చూపరులను కట్టిపడేస్తున్నాయి. కూరగాయలతో వివిధ ఆకృతులను తీర్చిదిద్దారు.

చారిత్రక స్ఫూర్తి... విజయనగర కీర్తి


నెత్తిన బిందెతో కర్రసాముపై ప్రదర్శన


నాణేల ప్రదర్శన తిలకిస్తున్న జేసీ సేతు మాధవన్


పళ్లతో చేసిన ఆకృతులు


మహిళల కోలాటం




పూర్వపు ఆడియో పరికరాలు పరిశీలిస్తున్న స్థానికులు

విజ్ఞాన వీచిక 'కోట'.. మహారాజా కోట విద్యార్థుల విజ్ఞాన సంపదకు వేదికగా నిలిచింది. పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. 220 ప్రాజెక్టులను ప్రదర్శించారు. రామతీర్థం, మెరకముడిదాం, తెర్లాం, జొన్నవలస, గర్భాం, రెల్లివలస విద్యాలయాల అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల్లో డ్రోన్లు, రోబోల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహనీయులు, వీర సైనికుల చిత్రాలను ప్రదర్శించారు.

ఊరికి దూరం.. నిర్వహణ భారం



భోగాపురం మండలంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. ఊరికి దూరంగా ఉండడంతో దీని నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటింటికీ చెత్తసేకరణ అంటూ పైసా వసూళ్లే ధ్యేయంగా చేపట్టి నిర్వహణ గాలికొదిలేశారు. తెదేపా ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల దిగుబడిని ప్రోత్సహించేది. నేడు రామచంద్రపేట, రెడ్డికంచేరు, తూడెం, తదితర ప్రాంతాల్లో ఆ పరిస్థితి కనుమరుగైంది. దీనిపై ఈవోపీఆర్డీ సురేష్ మాట్లాడుతూ.. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చొరవ తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, భోగాపురం

కాలువ నిర్మాణమే పరిష్కారం

మంగళపాలెం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు స్థానంలో నిర్మించిన భూగర్భ వంతెన (ఆర్‌యూబీ)కి ఆనుకొని రహదారి పక్కన మురుగు నిలిచిపోతోంది. ఇక్కడి ఇళ్ల వాడుక నీరు బయటకు వెళ్లే సదుపాయం లేక ఆర్‌యూబీలో ప్రవహిస్తోంది. సమీపంలోని గెడ్డలోకి మురుగునీరు పోయేందుకు కాలువ నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. దేశపాత్రునిపాలెం పంచాయతీ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ.. భూగర్భ కాలువ నిర్మాణానికి నరేగాలో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తవలస


ఆర్‌యూబీకి ఆనుకుని నిలిచిన మురుగు నీరు

గుంతల రహదారితో అవస్థలు



డెంకాడ మండలంలోని మోపాడ నుంచి కొండరాజుపేట, బంగారురాజుపేట వైపు వెళ్లే రహదారి గోతులతో అధ్వానంగా దర్శనమిస్తోంది. గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. రహదారి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పీఐయూ జేఈ వెంకటేష్ వద్ద ప్రస్తావించగా రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే అభివృద్ధి జరుగుతుందన్నారు. - న్యూస్‌టుడే, డెంకాడ

అపూర్వ సమ్మేళనం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్లలోని సెగిడివీధి రామ మందిరంలో 1968-69 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక ఏర్పాటు చేశారు. గుర్ల మండలం కలవచర్లలో 55 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకొని.. కాసేపు ముచ్చటించుకున్నారు. పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పట్నాయకుని ఫణీంద్రరావు, మానుకొండ పైడయ్య, రేకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి, మరాడాన రామారావు, పప్పు మురళీమోహన్‌రావు, సత్యవతి, అప్పలాభక్తుల చిట్టెమ్మలు, నక్కిన తాతబాబు, మానెం అన్నారావు తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్లలో కలిసిన 1968-69 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

జమ్మి వృక్షానికి అర్చనలు


పైడితల్లి వనంగుడిలో జమ్మి వృక్షానికి పూజలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: దశమి ఉత్సవాల్లో భాగంగా విజయనగరం పైడితల్లి అమ్మవారి వనంగుడి ప్రాంగణంలో ఉన్న జమ్మి వృక్షానికి శనివారం ప్రత్యేక పూజలు, అఖండ అర్చనలు జరిగాయి. విజయదశమి రోజున ఏటా ఇక్కడ ఈ వృక్షానికి పూజలు చేయడం ఆనవాయితీ. ఆలయ వేదపండితులు సాయికిరణ్‌శర్మ, నర్సింహమూర్తి మంత్రోచ్చారణల నడుమ వివిధ క్రతువులు సాగాయి. దశమి సందర్భంగా నాగోజీపేట దుర్గాలమ్మ రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.

ఉప్పుగెడ్డలో ఇసుక గుట్టలు

కల్తీకి పన్నాగం


సమీప ఖాళీ స్థలంలో వేసిన కుప్పలు

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలం రామచంద్రపేట సమీపంలోని ఉప్పుగెడ్డలో రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో నాటుబళ్లు, ట్రాక్టర్లతో అక్రమ రవాణా చేపడుతున్నా.. నిఘా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు పలు రకాల ఇసుక పోగులను కల్తీ చేసి లారీలతో సరిహద్దులు దాటిస్తున్నారు. ముందుగా చదును చేసిన స్థలాలకు నాటుబళ్లతో గెడ్డ నుంచి తీసుకొస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్లకు, లారీలకు ఎక్కించి బయటకు పంపిస్తున్నారు.

సమాచారం వస్తే.. గెడ్డ దాటేస్తారు..

ఉప్పుగెడ్డకు వెళ్లేందుకు రామచంద్రపేట, నందిగాం, మెట్టసబ్బన్నపేట వైపు నుంచి పలు రహదారులు ఏర్పాటు చేసుకున్నారు. తనిఖీ అధికారులు వస్తున్నారనే సమాచారం వస్తే వేర్వేరు మార్గాల్లో ఉడాయిస్తుంటారు. నాటుబళ్లపై వెళ్లేవారికి అడ్డూఅదుపు ఉండదు. బతుకు తెరువు కోసం చేసే చిన్న ప్రయత్నమంటూ తప్పించుకుంటారు. కొంత కాలంగా ఈ తతంగం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇక్కడి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడానికి సులువైన మార్గంగా తయారైంది.

తక్షణమే చర్యలు తీసుకుంటాం..

ఎక్కడికక్కడ ఇసుక అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నాం. రామచంద్రపేటలో గతంలో ఈ పరిస్థితి ఉండేది. దీంతో ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణా నివారించాం. మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. - ఎన్.వి.ప్రభాకరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, భోగాపురం

'విజయనగర వైభవ శతకం' పుస్తకావిష్కరణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం చరిత్ర, వారసత్వం, కళలు, ఇక్కడ పుట్టిన మహానుభావులను కీర్తిస్తూ ప్రముఖ రచయిత్రి మంగిపూడి రాధిక రాసిన 'విజయనగరం వైభవ శతకం' పుస్తకాన్ని మాన్సాస్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. జిల్లా వైభవాన్ని చెబుతూ రాసిన తొలి పద్య శతకమని పేర్కొన్నారు. సాగి జ్ఞానాంబ మెమోరియల్ బుక్‌ట్రస్ట్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగారురాజు, కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేధు మాధవన్ తదితరులు పాల్గొన్నారు. ● పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పైడితల్లి పూజా విధానం పుస్తకాన్ని అశోక్ ఆవిష్కరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు, మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు





పైడితల్లి అమ్మవారి జీవిత చరిత్రను తెలియజేస్తూ బీపీఎంఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.లక్ష్మీ ప్రసన్న, ఎన్.చరణ్ తేజ, దీక్షిత, కె.దీపక్ చిత్ర ప్రదర్శన నిర్వహించారు. - న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

ఆమె నేత్రాలు సజీవం



కొత్తవలస, న్యూస్‌టుడే: ఈ ఫొటోలో కనిపిస్తున్న **జి. సరోజిని (87)** నేత్రాలు (కార్నియాలు) చిరస్థాయిని సంతరించుకున్నాయి. కొత్తవలస పట్టణంలోని విశ్రాంత ఏఎస్సై వైకుంఠం మాత్రుమూర్తి సరోజిని శనివారం రాత్రి మృతి చెందారు. వ్యాపారి సత్యానందం సహకారంతో నేత్రదానానికి కృషి చేస్తున్న విన్నకోట రాజేష్ ఆధ్వర్యంలో ఈమె నేత్రాలు విశాఖలోని మోహిషిని ఐ బ్యాంకుకు కుటుంబ సభ్యులు దానం చేశారు. ఐ బ్యాంకు సిబ్బంది రాత్రి 11 గంటల సమయంలో వచ్చి అందరి సమక్షంలో ఈమె రెండు నేత్రాల నుంచి కార్నియాలు సేకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీచదరంగం అసోసియేషన్ జిల్లా శాఖ పర్యవేక్షణలో నగరంలోని ఫైర్‌చెస్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లా అండర్- 15 ఓపెన్, బాలికల చదరంగం టోర్నమెంటులో పలువురు సత్తా చాటారు. బాలుర విభాగంలో జి.లక్ష్మీ చరణ్ నాయుడు, కె.ప్రహ్లాద్, ఎం.నిహార్, నిఖిలేష్, బాలికల విభాగంలో బి.షణ్ముఖ ప్రియ, పరిణితి, నితీష, కె.సంజన తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. వీరు ఈనెల 15 నుంచి 17 వరకు గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చీఫ్ ఆర్బిటర్, చదరంగం సంఘం సీఈవో కేవీ జ్వాలాముఖి తెలిపారు.


క్రీడాకారులతో నిర్వాహకులు

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



నెల్లిమర్ల: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన శనపతి పల్లవి రెండు రజత పతకాలు సాధించారు. 71 కిలోల సీనియర్ విభాగంలో 94 కిలోల స్నాచ్, 114 కిలోల క్లీన్ అండ్ జర్క్ కలిపి 208 కిలోల బరువెత్తి పతకాలు కైవసం చేసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

సహ చట్టం అమలు దినోత్సవం

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద సహ చట్టం అమలు దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సహచట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు, న్యాయవాది బి.రామకృష్ణ, ఉద్యమకారులు రామకృష్ణ, లెంక సాంబమూర్తి పాల్గొన్నారు.

జానపద కళాకారులకు సన్మానం

జామి: జామి బజారు సెంటరులో దేవీ నవరాత్రుల్లో భాగంగా జానపద గాయకుడు జానకిరావు బృందం ఆధ్వర్యంలో కళాకారులను స్థానికులు సన్మానించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నేలకొరిగిన చింత చెట్టు



జామి: జామి ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న చింతచెట్టు ఈదురు గాలులకు నేలకొరిగింది. రెండు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. చెట్టును తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

కొత్తవలస: ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో నిధుల వినియోగంపై సోమవారం నుంచి పది రోజులు సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పరిశీలిస్తుందని ఏపీవో వై.జనార్దనరావు ఆదివారం తెలిపారు.

ఆర్టీసీ బస్సు కొనసాగించాలి

లక్కవరపుకోట: ఎస్.కోట డిపో నుంచి ఎల్.కోట, ఖాసాపేట, తలారి, కొట్యాడ మీదుగా విజయనగరం వెళ్తున్న బస్సును తరచూ నిలిపివేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్.కోట ఆర్టీసీ డీఎం రమేష్‌ను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, సోమవారం పరిశీలించి చర్యలు చేపడతానన్నారు.

ఏడీఏ కార్యాలయం మార్పు

కొత్తవలస: జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న కొత్తవలస వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ సంచాలకుడి (ఏడీఏ) కార్యాలయాన్ని తాత్కాలికంగా తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లోకి మార్చారు.

ఘనంగా స్వామివారికి చక్రస్నానం


చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పుష్కరిణి వద్దకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఘనంగా చక్రస్నానం నిర్వహించారు. శ్రీరామచంద్రస్వామివారి ఆలయంలో ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టారు. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించి ధ్వజావరోహణ చేశారు. ● రామతీర్థం దేవస్థానంలో శనివారం శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తులను నీలాచలం కొండపై కొలువైన కోదండ రామస్వామివారిని మెట్ల వద్దకు తీసుకొని వెళ్లి జమ్మిచెట్టు పూజ నిర్వహించారు. చెట్టుపైన స్వామివారి ధనస్సు, ధనుర్బాణం, ఖడ్గం ఉంచి అర్చనలు చేశారు. ఈవో వై.శ్రీనివాసరావు, గొర్లెపేట గ్రామస్థులు, భక్తులు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

తాటిపూడికి బుచ్చప్పారావు పేరు పునరుద్ధరించాలి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

జామి, న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయం నిర్మాణానికి కృషి చేసిన బుచ్చప్పారావు పేరు పునరుద్ధరించాలని జడ్పీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక బజారు కూడలిలో అప్పారావు జయంతిని ఆదివారం నిర్వహించారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు చినరామునాయుడు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ● అలమండలో తెదేపా మండల అధ్యక్షుడు లగుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన బుచ్చప్పారావు జయంతి వేడుకల్లో తెదేపా నాయకుడు గొంపకృష్ణ పాల్గొని నివాళులర్పించారు. ● రిజర్వాయరుకు బుచ్చప్పారావు పేరు కొనసాగించాలని పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం ఎస్.కోటలో డిమాండ్ చేసింది. ఏజీఎల్ కళాశాల ఆవరణలో జయంతి నిర్వహించి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు కొల్లి కోటేశ్వరరావు, నాయకులు జీఎస్ నాయుడు, వెంకట్రావు, డాక్టరు ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం


మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజలంతా సంఘటితంగా పోరాడి కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఉద్యమించాలని అఖిల పక్షం తీర్మానించింది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నగరంలో జరిగిన సమావేశంలో జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎంతో మంది పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా అంతా ముందుకు రావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పిలుపునిచ్చారు. జేవీవీ జాతీయ కార్యదర్శి ఎం.వి.ఆర్.కృష్ణాజీ, నాయకులు రొంగలి పోతన్న, సీర రమేష్, నయం, ఒమ్మి రమణ, రెడ్డి శంకరరావు, రాము, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

18న పాడి రైతుల జిల్లా సదస్సు

కొత్తవలస, న్యూస్‌టుడే: పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న జామిలో ఎస్‌బీఐ వెనుక ఉన్న కల్యాణ మండపంలో ఏపీ రైతు సంఘానికి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు చెప్పారు. దీన్ని విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా నిమ్మలపాలెం పాల ఉత్పత్తిదారుల సంస్థ భవనం వద్ద పాల ఉత్పత్తిదారులతో కలసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. జామిలో తలపెట్టిన సదస్సులో జిల్లాలోని పాల రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న వ్యకాసం నాయకులు